సాక్షి ఆదిలాబాద్

ఆదివారం ◊ 29 ◊ జనవరి ◊ 2023



కొనసాగుతున్న నాగోబా జాతర

ఈనెల 21న ప్రారంభమైన నాగోబా జాతర కొనసాగుతోంది. అధికారికంగా ముగిసినా భక్తులు శనివారం భారీగా తరలివచ్చారు. పూజలు చేసి మొక్కుతీర్చుకున్నారు. 10లో▸



బాబోయ్.. దొంగలు

జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. పలు మండలాల్లో వరుస చోరీలతో జనాలను హడలెత్తిస్తున్నారు. నలుగురు సభ్యులతో కూడిన ఓ ముఠా పనిగా పోలీసులు భావిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమ శాతంతో పాటు రాత్రి వేళలో చలి ప్రభావం తగ్గనుంది.

న్యూస్‌రీల్

టీచర్ల బదిలీల ప్రక్రియ షురూ

ఆదిలాబాద్‌టౌన్: టీచర్ల బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాను పొందుపర్చారు. ఈ మేరకు శనివారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ షురూ అయింది. ఈ నెల 30 వరకు గడువు ఉంది. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న హార్డ్‌కాపీలను సంబంధిత మండలాల విద్యాధికారులకు అందజేయాలని డీఈవో ప్రణీత తెలిపారు. ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు మండల విద్యాధికారులు హార్డ్ కాపీలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. బదిలీ, పదోన్నతుల ప్రక్రియ మార్చి 4వరకు కొనసాగనుంది.

స్పౌజ్‌లో కేటాయింపులు చేపట్టాలి

ఆదిలాబాద్‌టౌన్: గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులకు స్పౌజ్ కేటగిరీలో కేటాయింపులు చేపట్టాలని, 317 జీవో ద్వారా వేర్వేరు జిల్లాలకు కేటాయించబడిన ఉపాధ్యాయ దంపతులను వెంటనే జిల్లాకు బదిలీ చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాదవ్ అశోక్ కుమార్, మూగ శ్రీనివాస్ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈనెల 26న స్పౌజ్ కేటగిరీలో 13 జిల్లాలను అన్‌బ్లాక్ చేసిందని, ఆదిలాబాద్ జిల్లాకు కేవలం స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను మాత్రమే కేటాయింపులుచేసి, ఎస్జీటీలు,గ్రేడ్–2 పండితులను కేటాయించకపోవడం విడ్డూరమని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు స్పౌజ్ కేటగిరీలో వెంటనే జిల్లాకు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలుచేపడతామని హెచ్చరించారు.

పాఠశాలల్లో 'మధ్యాహ్న భోజన' అమలు తీరుపై ఆరా



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీటీలు

కైలాస్‌నగర్: జిల్లా పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు జిల్లాలోని తాంసి, భీంపూర్, నార్నూర్, ఉట్నూర్, బేల, జైనథ్, గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలను శనివారం సందర్శించారు. మధ్యాహ్నభోజనం పరిశీలించారు. నాణ్యతపై ఆరా తీశారు. కొన్ని చోట్ల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు రుచికరమైన, నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందించాలని ఎండీఎం నిర్వాహకులకు సూచించారు. పాఠశాలలను సందర్శించిన వారిలో డీటీలు రవీందర్, రమేష్, ప్రభాకర్, పుష్పమాల, శ్యాంసుందర్, ప్రేంనివాస్ బాబు సింగ్, మధుసూదన్ తదితరులున్నారు.

ఉట్నూర్ డీఎస్పీగా సీహెచ్ నాగేందర్

కైలాస్‌నగర్: ఉట్నూర్ సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా (డీఎస్పీ)గా సీహెచ్ నాగేందర్ నియామకమయ్యారు. కుమురంభీమ్ జిల్లా డీసీఆర్బీ ఫంక్షనల్ వర్టికల్స్ డీఎస్పీగా పనిచేస్తున్న ఈయనను ఉట్నూర్‌కు బదిలీ చేస్తూ డీజీపీ అంజనికుమార్ శనివారంఉత్తర్వులు జారీ చేశారు.

చేతులెత్తేసిన అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, పాల్గొన్న సభ్యులు



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఇతర అధికారులు

- సభ్యుల ప్రశ్నలతో ఉక్కిరిబిక్కిరి
- ప్రభుత్వ విధానాలతో ఏం చేస్తామన్నట్లుగా సమాధానం
- అప్రకటిత కరెంటు కోతలపై పలువురు సభ్యుల మండిపాటు
- ఏసీడీ చార్జీల బాదుడుపై గుస్సా
- దళితబంధు కోసం కమీషన్ వసూళ్లపై గరంగరం
- జెడ్పీ సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై వాడీవేడిగా చర్చ

ఏసీడీ చార్జీలపై మండిపాటు..

విద్యుత్ శాఖపై చర్చ సమయంలో తలమడుగు జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి వినియోగదారులపై ఏసీడీ చార్జీలభారంపై ఆగ్రహం వ్యక్తం చేశాడు.'సాక్షి'లో ఇటీవల ప్రచురితమైన కథనాన్ని చూపించారు. అప్రకటిత విద్యుత్ కోతలతో పంటలకు నీళ్లందని పరిస్థితి ఉందని బజార్‌హత్నూర్ జెడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య ప్రస్తావించాడు. త్రీఫేజ్ కరెంట్ అందించడంలో ప్రభుత్వ చేతకానితనం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. సంక్షేమశాఖలపై చర్చ సమయంలో దళితబంధు కోసం కొంతమంది రూ.2లక్షల కమీషన్ తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారంటూ గుడిహత్నూర్ జెడ్పీటీసీ బ్రహ్మానంద్, ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత, తాంసి జెడ్పీటీసీ రాజు, తలమడుగు జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి ఆరోపించారు. ఇటువంటివి తన దృష్టికి రాలేదని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శంకర్ అన్నారు. దేవాదాయ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని, వీటిపై ప్రభుత్వ ఆధ్వర్యంలో సర్వేచేసి రెవెన్యూలో రికార్డు చేసే విధంగా తీర్మానాన్ని తాంసి జెడ్పీటీసీ రాజు ప్రవేశపెట్టారు. జెడ్పీ చైర్మన్ జనార్దన్ సభ్యుల ఆమోదంతో దీన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తున్నట్లు వివరించారు. ఈ సర్వే చేపడతామని కలెక్టర్ సమాధానం ఇచ్చారు.

టీసీ అర్క పుష్పలత మాట్లాడుతూ ఎమాయికుంట పాఠశాలలో ఫ్లోరింగ్ పనులను పూర్తిగా ఇసుకతోనే చేపడుతున్నారని, ఉట్నూర్‌లోనూ పనులు నాణ్యతతో జరగడం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఇదేమని అడిగితే బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్లు చెప్తున్నారని, ఇలా అయితే ఎలాగంటూ ప్రశ్నించారు. స్పందించిన అదనపు కలెక్టర్ రిజ్వాన్ క్వాలిటీకంట్రోల్ విభాగంతో తనిఖీలు చేయిస్తామన్నారు. మండల సమావేశాల్లో డివిజన్ అధికారులు రావడం లేదని, ఈ విషయంలో ఉన్నతాధికారులు చెప్పినా స్పందన కనిపించడం లేదని ఇచ్చోడ ఎంపీపీ ప్రీతంరెడ్డి అన్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్ మండల సమావేశాల్లో డివిజన్ అధికారులు తప్పనిసరి పాల్గొనాలని ఇదివరకే ఆదేశాలు జారీ చేశామని ఇప్పటికీ పరిస్థితి మారకపోతే ఇకపై ఇదే లాస్ట్ వార్నింగ్ అని హెచ్చరించారు. ఈ విషయంలో జెడ్పీసీఈవో దృష్టి సారించాలని ఆదేశించారు. గ్రామీణాభివృద్ధి శాఖపై చర్చ సమయంలో 57 ఏళ్ల పింఛన్ లబ్ధిదారుల ఎంపికలో కొంత మందికి రెండేసి కార్డులు రావడంతో వాటిని రిటర్న్ చేశారని, అయితే ప్రస్తుతం వారికి ఏ కార్డుపై పింఛన్ రావడం లేదని, వాళ్లకు న్యాయం చేయాలని భీంపూర్ జెడ్పీటీసీ కుమ్ర సుధాకర్ అన్నారు. విచారణ చేసి అర్హులకు న్యాయం చేస్తామని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. వైద్య ఆరోగ్యశాఖపై చర్చ సందర్భంగా ఉట్నూర్ ఆస్పత్రిలో గైనకాలజిస్ట్ వైద్యులను అందుబాటులో ఉంచాలని జెడ్పీటీసీ చారులత కోరారు.

సాక్షి,ఆదిలాబాద్/కైలాస్‌నగర్: ఆ రోడ్డు నిర్మాణానికి మంజూరైనా నిధులెన్ని.. ఆ రహదారి మరమ్మతు ఎందుకు చేపట్టడం లేదు.. టెండర్ పూర్తయిందా లేదా.. అందులో మొత్తం ప్యాకేజీలు ఎన్ని.. పనులు ప్రారంభం అయ్యాయా.. లేదా.. అంటూ పలువురు సభ్యులు ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులను ప్రశ్నించారు. ఒక ప్రశ్న తర్వాత మరోప్రశ్న వేస్తూ అధికారులను గుక్కతిప్పుకోనివ్వని పరిస్థితి.. ఉక్కిరిబిక్కిరి అయిన అధికారులు ఓ దశలో తమ చేతిలో ఏమిలేదన్నట్లు.. ప్రభుత్వ విధానాల కారణంగా ఏమి చేయలేమని జవాబిచ్చారు. వాదోపవాదాలు నడుస్తుండగా అధికారులు అన్యపదంగానో.. మరోమోగాని.. గవర్నమెంట్ దగ్గర పేమెంట్ లేట్ అవుతుందని ఆర్‌అండ్‌బీ ఈఈ నర్సయ్య పేర్కొన్నారు. సర్వే చేస్తాం.. అంచనాలు రూపొందిస్తాం.. ఆ రోడ్డు పని మంజూరు మాత్రం మా చేతిలో ఉండదని పంచాయతీ రాజ్ ఈఈ మహవీర్ సభలో అనడం ఆశ్చర్యం కలిగించింది. ప్రభుత్వంలోని లోపాలను ఎత్తిచూపడమే ఈ ఆశ్చర్యానికి కారణం.

41 అంశాలపై చర్చ..

జెడ్పీ సర్వసభ్య సమావేశం శనివారం చైర్మన్ జనార్దన్ రాథోడ్ అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. కలెక్టర్ సిక్తా పట్నాయక్, బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పని లింగయ్య, అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, డీఎఫ్‌వో రాజశేఖర్ పాల్గొన్నారు. పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ గైర్హాజరయ్యారు. ఎజెండాలో 42 అంశాలు ఉండగా, రెండు విడతల్లో జరిగిన సమావేశంలో 41 అంశాలపై చర్చసాగింది. ఉదయం సెషన్‌లో విద్య, వైద్యశాఖలు, డీఆర్‌డీవో, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, టీడబ్ల్యూ ఇంజినీరింగ్ విభాగంపై సుదీర్ఘంగా చర్చ సాగింది. మధ్యాహ్న భోజనం తర్వాత రెండో సెషన్‌లో విద్యుత్‌శాఖ, వివిధ సంక్షేమ శాఖలపై కొంత చర్చ జరిగినా మిగతా శాఖల పరంగా నామమాత్రంగా చర్చించి సమావేశాన్ని ముగించారు.

మన ఊరు–మనబడి పనుల్లో నాణ్యతలోపం

మన ఊరు–మనబడి పనుల్లో నాణ్యత లోపం ఉందని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. ఇంద్రవెల్లి జెడ్పీ

పేదల అభివృద్ధికి తోడ్పడాలి



జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరుతెన్నులపై చర్చించేందుకు ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నాం. అధికారులు బాధ్యతతో పనిచేయాలి. పేదల ఆర్థిక స్థోమత పెంచేందుకు రుణాలందించాలి. ఆదివాసీ ఉద్యమ నాయకుడు సిడాం శంభు కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించేలా తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపిస్తాం. – జనార్దన్ రాథోడ్, జెడ్పీ చైర్మన్

అన్ని రంగాల్లో జిల్లా ముందడుగు



ఆదిలాబాద్ జిల్లాను ఒకప్పుడు వెనుకబడిన జిల్లాగా చెప్పేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ నేతృత్వంలో జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధిలో ముందడుగు వేస్తోంది. మారుమూల గూడేలు, తండాల్లోనూ తారురోడ్లతో పాటు తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాం. మరింత అభివృద్ధి సాధించేదిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి. – రాథోడ్ బాపూరావు, ఎమ్మెల్యే

సమావేశాలకు గైర్హాజరైతే కఠిన చర్యలు



జిల్లాలో జరిగే మండల పరిషత్ సర్వసభ్యసమావేశాలకు డివిజన్‌స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలి. లేకుంటే మెమోలు జారీ చేస్తాం. కఠిన చర్యలకు వెనుకాడేది లేదు. ఉట్నూర్ ఏరియా ఆసుపత్రిలో ప్రసవాలతో పాటు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు తప్పనిసరిగా నిర్వహించాలి. – సిక్తా పట్నాయక్, కలెక్టర్

ఢిల్లీ నుంచి అనుమతులు రావాలి



గిరి వికాసం కింద ఆదివాసీల భూముల్లో బోరుబావులు వేసుందుకోసం అటవీ అధికారుల అనుమతులు అవసరం లేదు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ జోన్ పరిధిలోని దరఖాస్తులకు ఢిల్లీ నుంచి అనుమతులు రావాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా 180 దరఖాస్తులు రాగా ఇప్పటివరకు 152 క్లియర్ చేశాం. మరో 28 పెండింగ్‌లో ఉన్నాయి. – రాజశేఖర్, డీఎఫ్‌వో

సంక్షేమ ఫలాలు అర్హులకు అందించాలి



పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. వాటి ఫలాలను అర్హులందరికీ అందించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంటుంది. ఈమేరకు చిత్తశుద్ధితో పనిచేయాలి

– అడ్డి భోజారెడ్డి, డీసీసీబీ చైర్మన్ ఉమ్మడి ఆదిలాబాద్

ఏసీడీ పేరిట ప్రజలపై భారం సరికాదు



రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని ప్రకటిస్తున్న ప్రభుత్వం అనధికార కోతలతో వారి పంటలు ఎండేలా చేస్తోంది. ఇప్పటికైనా స్పందించి విద్యుత్ కోతలు లేకుండా చూడాలి. అలాగే ఏసీడీ పేరిట ప్రజలపై అదనపు భారం మోపడం సరికాదు. – గోక గణేశ్‌రెడ్డి, జెడ్పీటీసీ, తలమడుగు

15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలి

- కలెక్టర్‌కు జెడ్పీటీసీల ఫోరం వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీలు

కైలాస్‌నగర్: పెండింగ్‌లో ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే విడుదల చేయాలని జెడ్పీటీసీల ఫోరం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫోరం ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. 2022–23 సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థికసంఘం కింద జిల్లా పరిషత్, మండల పరిషత్‌లకు రూ.2.16 కోట్ల నిధులను మంజూరు చేసిందన్నారు. అందుకు సంబంధించిన అభివృద్ధి పనులు, వివిధ కార్యక్రమాలు సైతం పూర్తయ్యాయన్నారు. కానీ ఆ నిధులను కేంద్రం ఇప్పటివరకు విడుదల చేయలేదన్నారు. వాటిని విడుదల చేయించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఫోరం అధ్యక్షుడు తాటిపెల్లి రాజు, గోక గణేశ్‌రెడ్డి, మల్లెపూల నర్సయ్య, పతంగే బ్రహ్మానంద్ తదితరులున్నారు.

సొనాల సబ్‌స్టేషన్ ముట్టడి



సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

బోథ్: అప్రకటిత విద్యుత్ కోతలకు నిరసనగా బోథ్ మండలంలోని సొనాల గ్రామానికి చెందిన రైతులు శనివారం ఆందోళన చేపట్టారు. సొనాల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. రాత్రి వేళల్లో కరెంటు ఇస్తున్నా... కేవలం గంట కూడా ఉండటం లేదన్నారు. 24 గంటలు నిరంతరాయంగా కరెంట్ అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామన్నారు.

ఆరోగ్య రక్షణపై అవగాహన



మాట్లాడుతున్న మనోహర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రాథమిక ఆరోగ్య రక్షణపై ఆశ కార్యకర్తలకు వైద్యాధికారులు అవగాహన కల్పించారు. డీఎంహెచ్‌వో కార్యాలయ సమావేశ మందిరంలో ఉట్నూర్ సెక్టార్ పరిధిలోని ఆశలతో శనివారం సమావేశం నిర్వహించారు. వైద్యారోగ్య జిల్లా శిక్షణ సంస్థ అధికారి మనోహర్ మాట్లాడుతూ.. మానసిక నరాల వ్యాధులు, వయోవృద్ధుల్లో వచ్చే సమస్యలు, జీవిత చరమాంకంలో ఉండే వ్యాధిగ్రస్తులకు అందించాల్సిన సేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శిక్షకులు లక్ష్మి, శ్యామల, సుశీల, వెంకటరెడ్డి, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలాబాద్!

- జిల్లాలో జోరుగా భూదందా
- అన్యాక్రాంతమవుతున్న సీసీఐ లీజు భూములు
- పరాధీనమవుతున్న ప్రభుత్వ, అసైన్డ్ స్థలాలు
- నకిలీ డాక్యుమెంట్స్‌తో హస్తగతం
- ప్రేక్షకపాత్రలో అధికార యంత్రాంగం



ఈ భూమి జిల్లాకేంద్రంలోని అటెండర్స్ కాలనీ సమీపంలో గల సర్వేనంబర్ 346, 68 పరిధిలోనిది. దీన్ని ఆనుకుని ప్రభుత్వ భూమి ఉండటంతో రియల్ వ్యాపారులు దానికి కంచే వేసి, ప్లాట్లుగా విక్రయించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ఈ భూమిలో తాము ప్లాట్లు కొన్నామని పేర్కొంటూ పలువురు ఇళ్ల నిర్మాణాలకు యత్నించగా వాటిని వ్యాపారులు కూల్చివేయడం గమనార్హం. ప్రస్తుతం ఈ భూమి వివాదాస్పదంగా మారింది.

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా భూ కబ్జాలకు అడ్డగా మారుతోంది. కొంతమంది అక్రమార్కులు ప్రభుత్వ, అసైన్డ్ తేడా లేకుండా ఖాళీ జాగా కనిపిస్తే చాలు వాటికి నకిలీపత్రాలు సృష్టించి హస్తగతం చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని సీసీఐ పరిశ్రమకు సంబంధించిన వందలాది ఎకరాల లీజు భూములు అన్యాక్రాంతమవుతుండగా, మావల మండల కేంద్రంతో పాటు బట్టిసావర్‌గాంవ్ పరిధిలోని కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జాలకు గురవుతున్నాయి. ఇదంతా ఉన్నతాధికారుల కళ్లెదుటే జరుగుతున్నా చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కట్టడి చేయాల్సిన అధికారులు సైతం 'మామూలు'గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అక్రమార్కులకు రాజకీయ అండదండలు సైతం తోడవడంతో వీరి ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో ప్రభుత్వ అవసరాలకు భూమి దొరకని పరిస్థితి ఏర్పడనుంది.

సీసీఐ లీజు స్థలాలపై పట్టింపేది?

జిల్లాకేంద్రంలో మూతపడ్డ సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమ కోసం ఆదిలాబాద్ మండలంలోని మల్లాపూర్, చాందా– టి, భీంసరి, బెల్లూరి, నిషాన్‌ఘాట్, జందాపూర్‌లో 2064.52 ఎకరాల భూములను వందేళ్ల కోసం లీజు కు తీసుకున్నారు. పరిశ్రమ మూతపడటం, భూములపై పర్యవేక్షణ కొరవడడంతో లీజుగడువు ముగిసిందంటూ రైతులు ఆ భూములను దున్నడం ప్రారంభించారు. ధరణి పట్టా పాస్ పుస్తకాలు సైతం పొందారు. ఐదారేళ్ల నుంచి భూముల ధరలకు రెక్కలు రావడంతో వీటిని అమ్మేస్తున్నారు.2వేలఎకరాల లీజుస్థలాల్లో 80శాతం భూ ములు క్రయ, విక్రయాలకు గురైనట్లుగా సీసీఐ ఎంప్లాయీస్ నాయకులు చెబుతున్నారు. ఈ భూములు ఇప్పటికే ముగ్గురు, నలుగురు చేతులు మారినట్లు తెలుస్తోంది. మరోవైపు 2025 వరకు లీజు గడువు పొడిగించినట్లు సీసీఐ అధికారులు చెబుతున్నారు. ఇక ఈ పరిశ్రమను ఆనుకుని ఉన్న కొద్ది పాటి భూములను సైతం రియల్ వ్యాపారులు ఆక్రమించి వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. లైమ్‌స్టోన్‌ను తవ్వేసి భూములను ఆక్రమించినా పట్టించుకునే వారే కరువయ్యారు. సీసీఐ అధికారి ప్రమేయంతోనే లీజు స్థలాలు అన్యాక్రాంతమవుతున్నట్లుగా తెలుస్తోంది.

ప్రభుత్వ స్థలాలు పరాధీనం ఇలా..

- మావల, బట్టిసావర్గాంతో పాటు ఆదిలాబాద్ పట్టణంలోని కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ, అసైన్డ్ భూములు పరాధీనమవుతున్నాయి. ఎన్‌వోసీలు ఇచ్చే అవకాశం లేని భూములకు సైతం బోగస్ పట్టాలను సృష్టించి ప్లాట్లుగా మార్చి అమ్మకాలు చేపడుతున్నారు.
- మావల శివారులోని సర్వేనంబర్ 170లో 184 ఎకరాల వరకు ప్రభుత్వ అసైన్డ్ భూమి ఉంది. దీనికి ఎన్‌వోసీ ఇవ్వడానికి వీల్లేదు. అయినా నకిలీ పత్రాలు సృష్టించి 80 ఎకరాలకు ప్లాట్లు చేసి విక్రయించారు. అలాగే సర్వే నంబర్ 18 1లో 600 ఎకరాలకు పైగా అసైన్డ్ భూమి ఉండగా ఇక్కడా నిబంధనలకు విరుద్ధంగా సు మారు 200 ఎకరాలకుపైగా భూమిని ప్లాట్లుగా చేసి అమ్మేశారు. సర్వేనంబర్ 131లోనూ 200 ఎకరాలకు అసైన్డ్ భూమి ఉండగా 50 ఎకరాల వరకు అక్రమంగా అమ్మేశారు.
- బట్టిసావర్‌గాం శివారులోని సర్వేనంబర్ 72 పరిధిలో సర్వేనంబర్ 67/1 పేరిట ప్లాట్లు చేసి విక్రయించారు. ఖానాపూర్ శివారులోని సర్వే నంబర్ 68లో 535 ఎకరాలు ఉండగా అక్కడ ఏకంగా 610 ఎకరాలకు పట్టాలు జారీ చేయడం అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
- ఇక సర్వేనంబర్ 68 పేరిట మావల శివారు ప్రాంతంలోని సర్వేనంబర్ 133, దస్నాపూర్ శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 21, ఆదిలాబాద్ శివారు ప్రాంతమైన సర్వేనంబర్ 346 లోని ప్రభుత్వ భూములను చూపించి అక్రమంగా పట్టాలు పొంది ఆ భూమిని అమ్మేశారు.
- తాజాగా ఆదిలాబాద్ శివారులోని సర్వేనంబర్ 346లో గల 87 ఎకరాల ప్రభుత్వ భూమికి నకిలీ డాక్యుమెంట్ సృష్టించి విక్రయాలు సాగిస్తున్నారు. రియల్ వ్యాపారులు, పలువురు రా జకీయ నాయకులు సిండికేట్‌గా మారి ఇలా ప్ర భుత్వ భూములను కొల్లగొడుతూ రూ. కోట్లు దండుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కట్టడి చేయాల్సిన అధికారులు కాసులకు కక్కుర్తిపడి వారికి సహకరిస్తున్నారనే విమర్శలున్నాయి. భూమి ధర బట్టి రూ.10 లక్షల నుంచి రూ.30లక్షల వరకు ముడుపులు పొందుతున్నట్లుగా స మాచారం. ఇప్పటికై నా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూములను సంరక్షించేదిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో సాగుతున్న భూ కబ్జాలపై వివరణ కోరేందుకు జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్‌కు పలుమార్లు ఫోన్ చేయగా ఆయన స్పందించలేదు. అలాగే ఆర్డీవో రమేశ్ రాథోడ్‌ను ఫోన్‌లో సంప్రదించే యత్నం చేయగా ఆయన కూడా అందుబాటులోకి రాలేదు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- రిమ్స్ ఎదుట కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు తమ ఆందోళనలు ఉధృతం చేశారు. తెలంగాణ యూనైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) ఆధ్వర్యంలో ఆస్పత్రి ఎదుట శనివారం నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ, 300 మంది కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు ఎనిమిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై రిమ్స్ డైరెక్టర్‌ను, కలెక్టర్‌ను కలిసి విన్నవించినా ఇప్పటివరకు సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అర్హత కలిగిన వారందరినీ రెగ్యూలరైజ్ చేయడంతో పాటు పెండింగ్ వేతనాలు చెల్లించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడు సుమన్ తయ్, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

రథయాత్రకు ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

నేరడిగొండ: ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్ జిల్లా గుత్తి బల్లారి నుంచి ప్రారంభమైన శ్రీసంత్ సేవాలాల్ మహరాజ్ రథయాత్ర శనివారం మండలంలోని రాజురా గ్రామానికి చేరుకుంది. దీంతో గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అనిల్ జాదవ్, సర్పంచ్ అనూష, వసంత్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రీడలతో పాటు చదువు లోనూ రాణించాలి



బహుమతులు అందిస్తున్న వినోద్‌నాయక్

ఇంద్రవెల్లి: గ్రామీణ ప్రాంత యువత క్రీడలతో పాటు చదువులోనూ రాణించాలని ఏఐసీసీ రీసెర్చ్ డిపార్‌మెంట్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినోద్ నాయక్ అన్నారు. మండలంలోని దోడంద గ్రామంలో జైసేవాలాల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ ముగింపు కార్యక్రమానికి హాజరై ప్రతిభ కనబరిచిన క్రీడా జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తున్నామని, అందులో భాగంగా అనేక మారుముల గ్రామాల యువతకు వాలీబాల్, కబడ్డీ, క్రికెట్ కిట్లు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామీణ ప్రాంత యువత క్రీడాలతో పాటు చదువులో కూడా రాణించాలన్నారు. ఈ సందర్భంగా నాయకులు పవార్ దూదిరామ్‌నాయక్, రాథోడ్ రవీందర్, ఉత్తం రాథోడ్, సజన్‌సింగ్, దత్తారం, రఘునాథ్, కల్యాణ్, జాదవ్ రామ్‌కుమార్, వినోద్‌కుమార్, మనోజ్ రాథోడ్ ఉన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



బాయవ్వ (ఫైల్)

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ రూరల్ మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు కుంట బాయవ్వ (105) శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. వందేళ్లు పైబడినప్పటికీ నిత్యం తన పనులు తానే చేసుకుంటూ, పలువురి పలకరిస్తూ ఆరోగ్యంగా ఉండేదని గ్రామస్తులు తెలిపారు.

'పాలకుల వైఫల్యంతో రైతులకు నష్టం'



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాస్

ఖానాపూర్: పాలకుల వైఫల్యంతో మండలంలోని సదర్మాట్ ఆయకట్టు రైతులకు తీవ్ర నష్టం వాటిల్లితుందని సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసి) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్ అన్నారు. శనివారం ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో సాగునీటి సమస్యపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సదర్మాట్ నూతన బ్యారేజి నిర్మాణంతో పాత ఆయకట్టుకు సాగునీటి విషయంలో తీవ్ర అన్యాయం జరుగనుందన్నారు. చివరి ఆయకట్టుకు నీటిని అందించడంలో పాలకులు విఫలమయ్యారని తెలిపారు. పోరాటాలు చేస్తే తప్ప రైతులకు సాగునీరు అందని దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సరస్వతీ కాల్వ డీ–27, డీ–28 పరిధిలో నీరందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా రైతుల సాగునీటి సమస్యలపై ఎంఎల్‌ఏతో పాటు మంత్రులకు వినతి పత్రాన్ని ఇవ్వాలని నిర్ణయించారు. కార్యక్రమంలో నాయకులు జే రాజు, సునారికారి రాజేశ్, గోపి నర్సయ్య, బన్సిలాల్, పీటర్, బుక్యా సురేందర్, రమేశ్, పస్పుల వెంకన్న, లోకిని రాము, గోవింద్, అశోక్, స్వామి, వెంకటేశ్ ఉన్నారు.

బాబోయ్.. దొంగలు

- జైనథ్ మండలంలోని దీపాయిగూడలో ఈ నెల 24న అర్ధరాత్రి నలుగురు దొంగల ముఠా రెండు ఇళ్లల్లో చోరీకి యత్నించింది. ఓ ఇంట్లో చొరబడి 13 తులాల బంగారం, రూ.20వేల నగదును ఎత్తుకెళ్లింది. మరో ఇంటిఎదుట పార్కు చేసిన ద్విచక్ర వాహనాన్ని సైతం దొంగిలించారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌసింగ్ బోర్డులో శుక్రవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో దొంగలు పడ్డారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగలగొట్టి 19 తులాల బంగారం, 33 తులాల వెండి, రూ.3వేల నగదు దొంగిలించారు.
- బోథ్ మండలం పొచ్చెర గ్రామంలో గురువారం అర్ధరాత్రి పలు ఇళ్లలోకి చొరబడ్డారు. వారి చేతుల్లో పదునైన ఆయుధాలు ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వారిని చూసి కొంత మంది గ్రామస్తులు ఇండ్లలోకి వెళ్లారు. నలుగురు వ్యక్తులు గ్రామంలో తిరిగిన వీడియో సీసీ కెమెరాలో రికార్డయింది. ఓ ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు.
- ఆదిలాబాద్ బస్టాండ్‌లో పార్కింగ్ చేసిన ఓ కానిస్టేబుల్ బైక్‌ను మూడు రోజుల క్రితం దొంగలించారు. విధుల్లో భాగంగా హైదరాబాద్‌కు బస్సులో బయలుదేరగా, తన వాహనాన్ని బస్టాండ్‌లో పార్కింగ్ చేశాడు.



బోథ్‌లోని పొచ్చెరలో రోడ్డు దాటుతున్న దొంగలు (ఫైల్)

- వరుస చోరీలతో అయోమయం
- ఆదిలాబాద్ జిల్లాలో వరుస చోరీలు
- జనాలను హడలెత్తిస్తున్న చెడ్డీ గ్యాంగ్?
- పోలీసులకు సవాల్‌గా మారిన ఘటనలు
- తాజాగా ఇచ్చోడలోని రెండిళ్లలో చోరీకి యత్నం



జైనథ్‌లోని ఓ ఇంట్లో వస్తువులను పడేసిన దొంగలు(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. వరుస దొంగతనాలతో జనాలు భయాందోళనకు గురవుతున్నారు. నలుగురు సభ్యులతో కూడిన ముఠా జిల్లాలో కలకలం సృష్టిస్తోంది. పోలీసులకు సైతం కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మూడు, నాలుగు రోజులుగా జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతూనే ఉన్నాయి. పోలీసులు అప్రమత్తమైనా ఆ ముఠా పట్టుబడడం లేదు. జైనథ్ మండలం దీపాయిగూడ, ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డు, బోథ్‌లోని పొచ్చెర, ఇచ్చోడలో వీరి ఆగడాలు మితిమీరాయి. తాళం వేసి ఉన్న ఇండ్లతో పాటు అర్ధరాత్రి ఇళ్లల్లోకి చొరబడి అందినకాడికి దోచుకుంటున్నారు. ఈ ముఠా ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాలో చొరబడినట్లు పోలీసు అధికారులు అనుమానిస్తున్నారు.

చెడ్డిగ్యాంగ్ పనేనా.?

జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా చెడ్డి గ్యాంగా.? లేక ఇతర ఏ ముఠానా.. అని పోలీసులు ఆరా తీస్తున్నారు. జైనథ్, పొచ్చెరలో నలుగురు వ్యక్తులతో కూడిన ముఠా కాలనీలో సంచరిస్తుంతగా, ఆయా సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. బోథ్ మండలం పొచ్చెరలో నలుగురు వ్యక్తులు చేతుల్లో ఇనుప రాడ్లు, కత్తులతో గ్రామంలోని రోడ్లపై సంచరించారని స్థానికులు చెబుతున్నారు. ఇదే ముఠా ఇచ్చోడలో సైతం దొంగతనానికి యత్నించి ఇంట్లోని వ్యక్తులను చూసి పరారయ్యారు. నాలుగైదు రోజులుగా ఏదో ఓ చోట దొంగతనానికి పాల్పడడంతో జనాలు భయాందోళనలకు గురవుతున్నారు.

పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు..

వరుస దొంగతనాలతో ప్రజలకు, పోలీసులకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. దొంగలను పట్టుకునేందుకు నాలుగు పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా 14 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో వాహన తనిఖీలు సైతం చేపడుతున్నారు. జిల్లాలో ఆయా ప్రాంతాల్లో పోలీసులు రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహిస్తున్నప్పటికీ దొంగతనాలు ఆగడం లేదు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు జిల్లాలోని ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా వీరి ఆగడాలను నివారించలేకపోతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వారి ఆగడాలను పోలీసులు అరికట్టలేకపోతున్నారు.

అనుమానితులు సంచరిస్తే సమాచారం ఇవ్వండి



జిల్లాలో ఎక్కడైనా అనుమానితులు సంచరిస్తే డయల్ 100, పోలీసులకు సమాచారం ఇవ్వండి. ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్తే చుట్టూ పక్కల వారికి చెప్పి వెళ్లండి. విలువైన నగదు, బంగారం ఇంట్లో పెట్టి బయటకు వెళ్లొద్దు. జిల్లాలో దొంగతనాలకు పాల్పడుతున్న గ్యాంగ్ బయట వ్యక్తులుగా అనుమానిస్తున్నాం. 10 ప్రాంతాల్లో వాహన తనిఖీలు చేపడుతున్నాం. గ్రామాల్లో కూడా పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాం.

– డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఎస్పీ

బైక్ చోరీలు అధికమే..

జిల్లాలో బైక్ చోరీలు అధికంగానే జరుగుతున్నాయి. గతేడాది పోలీసుల లెక్కల ప్రకారం 47 ద్విచక్ర వాహనాలు చోరీకి గురైనట్లు చెబుతుండగా, అనధికారికంగా వందల సంఖ్యలోనే ఉంటాయి. ఈ ఏడాది జనవరిలో ఇప్పటి వరకు అధికారికంగా నాలుగు వాహనాలు చోరీకి గురయ్యాయి. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయని వారు పదుల సంఖ్యలో ఉంటారు. బస్టాండ్, రైల్వే స్టేషన్, రిమ్స్ ప్రాంతంలో చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయి. గత ఏడాది దాదాపు రూ.2 కోట్ల నగదు వరకు ఎత్తుకెళ్లగా ఈ ఏడాదిలో దాదాపు 30 తులాలకు పైగా బంగారం, రూ.లక్షలోపు నగదు దోచుకుపోయారు.

కర్రలు చేతపట్టి.. గస్తీ చేపట్టి..

బోథ్: మండలంలో చెడ్డి గ్యాంగ్ స్థానికులకు కునుకులేకుండా చేస్తోంది. రెండు రోజుల క్రితం పొచ్చెర గ్రామంలో బైక్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు ప్రస్తుతం కనుగుట్ట గ్రామంలోని చేనుల్లో తిరుగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. శనివారం రాత్రి గ్రామస్తులందరూ కలిసి గస్తీ నిర్వహించారు. ఇద్దరు యువకులు బోథ్ వస్తుండగా వెంకటేశ్వర ఆలయం వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా పరిగెత్తెడం చూశారు. వెంటనే ఎస్సై రవీందర్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని చేనులో గాలించారు.



కనుగుట్టలో గస్తీ నిర్వహిస్తున్న గ్రామస్తులు

ఇచ్చోడలో చోరీకి యత్నం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని విద్యానగర్, సాయినగర్ కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. విద్యానగర్‌లోని ఇందారపు బాలకృష్ణ, సాయినగర్‌లోని తృప్తి గంగాధర్ ఇళ్లల్లో అర్ధరాత్రి ఇంటి డోర్‌లకు డ్రీల్ ద్వారా రంధ్రాలు చేసి ఇళ్లలోకి చొరబడ్డారు. చప్పుడు కావడంతో బాలకృష్ణ కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో దొంగలు పారిపోయారు. పక్కనే ఉన్న సాయినగర్‌లోని గంగాధర్ ఇంట్లో చోరికి యత్నించారు. వారు వెంటనే 100 డయల్‌కు కాల్ చేయడంతో పోలీసులు రావడాన్ని గమనించి పరారయ్యారు. శనివారం ఉదయం డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. సంఘటన స్థలాన్ని సీఐ నైలు, ఇన్‌చార్జి ఎస్సై నీరేశ్‌లు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



ఇంటిని పరిశీలిస్తున్న సీఐ నైలు

భయాందోళనలకు గురికావద్దు....

ప్రజలు భయాందోళనలకు గురికావద్దని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సాయంత్రం మండల పోలీస్‌స్టేషన్ సందర్శించి మాట్లాడారు. జిల్లా పోలీసు యంత్రాగం పూర్తిగా అప్రమత్తంగా ఉందన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు సమాచారం ఉంటే వెంటనే 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

కోర్టు ఆర్డర్ ధిక్కరించిన పలువురిపై కేసు

నిర్మల్‌టౌన్: కోర్టు ఆర్డర్ ధిక్కరించిన పలువురుపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ శ్రీనివాస్ శనివారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బస్ డిపో బోయవాడకు చెందిన జింక లక్ష్మి కుటుంబం సుమారు 20ఏళ్లుగా బోయవాడలోని తోకల భూదేవి ఇంట్లో కిరాయికి ఉంటోంది. సుమారు 15ఏళ్ల నుండి ఇంటి యజమాని భూదేవి, లక్ష్మిని ఇల్లు ఖాళీ చేయాలని కోరుతున్నప్పటికీ ఖాళీ చేయడం లేదు. దీంతో భూదేవి కోర్టును ఆశ్రయించింది. దీంతో లక్ష్మి ఇల్లు ఖాళీ చేయాలని 2022న కోర్టు తీర్పునిచ్చింది. అయినా లక్ష్మి ఇల్లు ఖాళీ చేయకుండా కోర్టు ధిక్కారణకు పాల్పడింది. దీంతో లక్ష్మి, ఆమె కుమారులు అభిలాష్, అరవింద్, కుటుంబ సభ్యులు శ్రావణి, ఇతరులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

నేరడిగొండ: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి కుప్టి–కుమారి మార్గంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న వివరాల ప్రకారం... మండలంలోని కుప్టి (కె) గ్రామానికి చెందిన రాజేశ్వర్ (54) ద్విచక్ర వాహనంపై కుప్టి వైపు నుంచి కుమారి వైపు వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న మహారాష్ట్ర కిన్వట్ తాలుక బెల్లారి గ్రామానికి చెందిన లక్ష్మణ్ ద్విచక్రవాహనం ఢీకొనగా రాజేశ్వర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం మృతదేహన్ని బోథ్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'డీజిల్'దొంగతనం కేసులో ఒకరి రిమాండ్

భైంసాటౌన్: బస్సుల్లో నుంచి డీజిల్ దొంగతనం చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ ఎస్సై హన్మాండ్లు శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.. మహారాష్ట్రకు చెందిన అనిల్ భైంసాలోని గోపాల్‌నగర్‌లో నివాసముంటున్నాడు. గతంలో ఆర్టీసీ హైర్‌బస్ డ్రైవర్‌గా పనిచేసి మానేశాడు. ఈ క్రమంలో భైంసాలోని ఆర్టీసీ డిపో సమీపంలో హైర్‌బస్సులు నిలిపి ఉంచుతారనే విషయం గమనించి, డీజిల్ దొంగతనం చేయడానికి అలవాటు పడ్డాడు. ఇటీవల ఓ బస్సులో నుంచి డీజిల్ దొంగతనం కాగా అనుమానం వచ్చిన బస్సు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న ఏపీ ప్రిన్సిపాల్ సెక్రటరీ

భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎండోమెంటల్ ప్రిన్సిపాల్ సెక్రెటరీ జేఎస్‌వి ప్రసాద్ శనివారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. మనుమరాలు ద్రితికి అక్షరాభ్యాసం కోసం బాసరకు వచ్చాడు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన అమ్మవారి నగలు



పంచనామా నిర్వహిస్తున్న ఆర్ఐ బాలకిషన్



దగ్ధమైన ఇల్లు

- పుస్పూర్‌లో పంచనామా నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది
- కాలిపోయిన మహాలక్ష్మీ అమ్మవారి నగలు

లోకేశ్వరం: షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని పుస్పూర్ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... సిందే వేణుపటేల్‌కు చెందిన ఇంట్లో శనివారం మధ్యాహ్నం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి పొగలు రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది సంఘట స్థలానికి చేరుకుని మంటలు అర్పివేశారు. ఇంట్లోని మహాలక్ష్మి అమ్మవారి నగలు, ఇంటి సామగ్రి కాలిపోయాయి. ఆర్ఐ బాలకిషన్ పంచనామా నిర్వహించి రూ.5లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లినట్లు అంచనా వేశారు. సర్పంచు నర్సయ్య, వీఆర్ఏ జలందర్ ఉన్నారు.

మినీ టీహబ్‌తో విద్యార్థులకు మేలు



పత్రాలు చూపిస్తున్న వీసీ, సంస్థ ప్రతినిధులు

భైంసా(ముధోల్): నిజామాబాద్‌లో మినీ టీ హబ్ ఏర్పాటుతో బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెంకటరమణ అన్నారు. నిజామాబాద్‌లోని కాకతీయ శాండ్‌బాక్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం వర్సిటీలో డెవలప్‌మెంట్ డైలాగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పలు కంపెనీల సీఈవోలకు ఆర్జీయూకేటీలో విద్యా విధానంపై వివరించారు. అనంతరం కాకతీయ శాండ్‌బాక్స్ సంస్థతో అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్(ఆర్అండ్‌డీ) డాక్టర్ వీ.చంద్రశేఖర్‌రావు, అసోసియేట్ డీన్స్, టీపీవో, ఐఐఈడీ కోఆర్డినేటర్, ఫ్యాకల్టీ పాల్గొన్నారు.

బడ్జెట్‌కు అనుగుణంగానే పనులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎఫ్‌డీపీటి వినోద్ కుమార్

కడెం: పునరావాస కాలనీలో ఇళ్ల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా చేపడుతున్నామని ఎఫ్‌డీపీటీ వినోద్‌కుమార్ తెలిపారు. కవ్వాల్ టైగర్ జోన్ పరిధిలోని రాంపూర్, మైసంపేట వాసులకు కొత్త మద్దిపడగ వద్ద పునరావాసం కల్పించాలని అటవీశాఖ అధికారులు నిర్ణయించారు. ఈమేరకు కాలనీలో పనులు కూడా చేపట్టారు. అయితే ఇళ్ల నిర్మాణం తక్కువ సైజులో చేయడంపై ఇటీవల రెండు గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో నిర్వాసితులతో అధికారులు శనివారం సమావేశం నిర్వహించారు. అంతకుముందు పునరావాస కాలనీలో ఆట స్థలం, ఆలయ నిర్మాణం కోసం ఎంపిక చేసిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. లబ్ధిదారుల సందేహాలు నివృత్తి చేశారు. ఇళ్ల నిర్మాణ సైజు పెంచాలని కోరగా, కేటాయించిన బడ్జెట్ మేరకు 20 గీ24 సైజులో ఇళ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. సైజు పెంచితే బడ్జెట్ సరిపోదని తెలిపారు. సమావేశంలో డీఎఫ్‌వో సునీల్ హీరమాత్, ఎఫ్‌డీవో కోటేశ్వర్‌రావు, ఎఫ్ఆర్‌వోలు అనిత, వినాయక్, తహసీల్దార్ గజానన్ తదితరలు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



మడావి దేవిదాస్(27)

బోథ్: మండలంలోని రేండ్లపల్లె గ్రామానికి చెందిన మడావి దేవిదాస్(27) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. దేవిదాస్ గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక ఇంట్లోనే ఉంటున్నాడు. శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. గ్రామ సరిహద్దులో పురుగుల మందుతాగి పడిపోయాడు. గమనించిన స్థానికుల సమాచారం మేరకు కుటుంబీకులు బోథ్‌లోని సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు

తహసీల్దార్‌ను దూషించిన వ్యక్తి రిమాండ్

కడెం: మండల తహసీల్దార్ గజానన్‌ను అంబార్‌పేట్ గ్రామానికి చెందిన కట్ల సాగర్ అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో తహసీల్దార్ ఫిర్యాదు మేరకు శనివారం సాగర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

బజార్‌హత్నూర్: బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొనగా యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని కొలారి గ్రామం వద్ద శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సయ్యద్ ముజాహిద్దిన్ వివరాల ప్రకారం... మహారాష్ట్రకు చెందిన సోను (19), కొలారి గ్రామానికి చెందిన దుదుడే కైలాస్ బంధువులు. వీరు శనివారం రాత్రి బైక్‌పై మండల కేంద్రానికి వస్తుండగా గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సోను సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. కైలాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



పెళ్లికొడుకు ఎంట్రీ అదుర్స్...

బోథ్: మండల కేంద్రానికి చెందిన ఫారుక్ వివాహం ఇటీవల జరిగింది. వివాహం వేడుకను అందరు గుర్తుంచుకోవాలనుకున్నాడు. క్రేన్ సాయంతో ఆకాశం నుంచి నేరుగా పెళ్లి మంటపంపైకి ఎంట్రీ ఇచ్చాడు. ఈ దృశ్యం స్థానికులను అబ్బురపరిచింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.





బాసరలో రథసప్తమి

భైంసా: శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాసరలో 806 అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయంలో భక్తుల తాకిడి కనిపించింది. గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి చిన్నారులకు అక్షరాభ్యాస పూజలు జరిపించారు. అనంతరం సరస్వతీ, మహాలక్ష్మీ , మహాంకాళీ అమ్మవార్లను దర్శించుకున్నారు.

వేద ఆశీర్వచనం ప్రారంభం

చదువులమ్మ కొలువైన బాసరలో వేద ఆశీర్వచనము ప్రారంభించారు. శనివారం నుంచి ఈ సేవలు అందుతున్నాయి. వేద ఆశీర్వచనం పొందాలనుకున్న భక్తులు కౌంటర్‌లో రూ. 500 చెల్లించి టికెట్టు తీసుకోవాలి. బాసర అమ్మవారి ఆలయ ప్రాంగణంలో కుటుంబీకులకు వేద ఆశీర్వచనం ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు.